క్లుప్తంగా

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు

కంభం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు జరుగుతున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో చేరదలిచే విద్యార్థులు కళాశాలలో ప్రవేశం కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాణ్యమైన అధ్యాపకులు అందుబాటులో ఉన్నారని, విద్యార్థులు చేరి తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని కోరారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

కంభం: సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా పని చేసి ప్రజలకు నాణ్యమైన సేవలందించాలని ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్‌వలి అన్నారు. నూతనంగా ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన ఆయన శుక్రవారం కందులాపురం–1 సచివాలయాన్ని సందర్శించారు. రికార్డులు పరిశీలించిన అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సమయపాలన పాటిస్తూ సచివాలయానికి వచ్చిన ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తుండాలని సూచించారు.

ఉపాధి పనుల పరిశీలన

కంభం: కంభం పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్ వలి శుక్రవారం పరిశీలించారు. పనులు జరుగుతున్న ప్రదేశంలో మస్టర్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. గుర్తించిన పనులు కొలతల ప్రకారం చేసుకుంటే మంచి కూలి వస్తుందన్నారు. పనికి వచ్చిన వారికి మాత్రమే హాజరు వెయ్యాలని సూచించారు.

వలంటీర్ల పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

గిద్దలూరు రూరల్: గిద్దలూరు నగర పంచాయతీ పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టులను భర్తీ చేసేందుకు శనివారం నుంచి ఈ నెల 22వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు స్థానిక నగర పంచాయతీ కమిషనర్ వై.రామకృష్ణయ్య తెలిపారు. నల్లబండ బజారు, అర్బన్ కాలనీ, నంద్యాల రోడ్డు, బండెలదొడ్డి బజారు, గణేష్‌నగర్, ఏబీఎం పాలెం , క్లబ్ రోడ్డులోని సచివాలయాల పరిధిలో పని చేసేందుకు వలంటీర్లు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 23న దరఖాస్తుల పరిశీలన, 24న మౌఖిక పరీక్ష, 26న వలంటీర్ల ఎంపికైన వారి వివరాలు తెలియజేయటం, 27న నియామక పత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

విద్యా కానుక కిట్ల పంపిణీ

పెద్దారవీడు: మండలంలో సుంకేసుల మండల ప్రజా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు విద్యా కానుక కిట్లను సర్పంచ్ గుడ్డెపోగు రమేష్ శుక్రవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెద్దపీట వేశారని కొనియాడారు. హెచ్‌ఎం డి. వినోద్ శాస్త్రి, పాఠశాల వైస్ చైర్మన్ తంగిరాల మార్తమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు గుర్రం ముత్యాలయ్య, గుడ్డెపోగు వెంకట సుబ్బయ్య, భూతపాటి యోకోబు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పెద్దారవీడు: మండలంలోని తంగిరాలపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం సాయంత్రం 3 గంటలకు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ నాసర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ముఖ్య అతిథిగా పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ హాజరవుతారని, పలు శాఖల మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

పొట్లపాడు సచివాలయం పరిశీలన

కురిచేడు: మండలంలోని పొట్లపాడు సచివాలయాన్ని ఈఓఆర్డీ ఆర్‌వీఎస్ ప్రసాదరావు శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం, శానిటేషన్, తాగు నీరు, వీధి దీపాలు, ఇంటి పన్నుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం హౌసింగ్ డే నిర్వహించారు. జ్యోతి అంకాలయ్య, అనుపల్లి చెన్నారెడ్డి పాల్గొన్నారు.

అనధికారిక లేఔట్లను తొలగిస్తాం

గిద్దలూరు రూరల్: గిద్దలూరు మండలం కొంగలవీడు, కొమరోలు మండలం తాటిచెర్ల గ్రామాల పరిధిలోని అక్రమ లేఔట్లను గురువారం తొలగించినట్లు ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనధికారిక లేఔట్లను తొలగించేందుకు అయ్యే ఖర్చును ప్లాట్ల యజమానుల వద్ద వసూలు చేస్తామని చెప్పారు. అనధికారిక లేఔట్లను వేయడం చట్టరీత్యా విరుద్ధమని హెచ్చరించారు. ప్లాట్లు కొనుగోలు చేసే వారు స్థానిక గ్రామ పంచాయతీ, నగర పంచాయతీ, ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థ కార్యాలయం నుంచి అనుమతులు పొందిన వారి వద్దే కొనుగోలు చేయాలని కోరారు.

తెలుగు బాప్టిస్టు చర్చి వార్షికోత్సవం

ముండ్లమూరు: మండలంలోని చిన ఉల్లగల్లులో తెలుగు బాప్టిస్టు చర్చి 14వ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. క్రైస్తవ సోదరులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సంఘకాపరి డేవిడ్ హారిసన్ క్రీస్తు బోధనలు వినిపించారు. పాస్టర్ క్రాంతికుమార్, బిషప్, శాంసన్, సూర్యచంద్ర పాల్గొన్నారు.



నా పేరు షేక్ హాజరాబీ. నాది గుంటూరు జిల్లా చిలకలూరిపేట. నాకు పిల్లలు లేరు. ఓపిక ఉన్నంత వరకూ పొగాకు బోర్డులో గ్రేడింగ్ పనులకు వెళ్లి బతికా. అప్పుడు నాకు రెండు వందల పింఛన్ వచ్చేది. ఒంట్లో ఓపిక తగ్గినాక నా చెల్లెలితో కలిసి కురిచేడు వచ్చి ఉంటున్నా. ఇద్దరం ఏ పనీ చేయలేని స్థితిలో ఉన్నాం. రెండు వందల కోసం చిలకలూరిపేట వెళ్లి పింఛన్ తెచ్చుకునే దాన్ని. అవి చార్జీలకే సరిపోయేవి. పేరుకే పింఛన్. దానితో ఉపయోగం ఉండేది కాదు. ఏ పనీ చేయలేక.. సంతానం లేని నాకు దేవుడు పంపిన కొడుకుగా వచ్చాడు ముఖ్యమంత్రి జగన్. పింఛన్ పెంచాడు. నాకు నెలనెలా గడిచిపోతోంది. ప్రస్తుతం 2,750 రూపాయలు పింఛన్ ఇస్తున్నాడు. రేషన్ కార్డు ద్వారా 5 కిలోల బియ్యం వస్తున్నాయి. కాలం ప్రశాంతంగా గడిచిపోతోంది. జగన్‌మోహన్‌రెడ్డి పదికాలాల పాటు సంతోషంగా, సుఖంగా ఉండి నాలాంటి వారికి సాయం చేయాలి. ఆయన మేలు ఈ జన్మలో మరువ లేను.



నా పేరు మహబూబీ. నాది గుంటూరు జిల్లా చిలకలూరిపేట. మా అక్కతో కలిసి పొగాకు బోర్డులో గ్రేడింగ్ పనికి పోయే వాళ్లం. రోజుకు రూ.15–20 రూపాయలు కూలి ఇచ్చే వారు. మాకు ఓపిక తగ్గిపోయాక నా కుమార్తె, అల్లుడు కురిచేడులో ఉన్నారు. వారికి దగ్గరలో ఉండాలని నాలుగేళ్ల క్రితం నా అక్కతో వచ్చాను. నేను, నా అక్క కలిసి ఒక ఇల్లు అద్దెకు తీసుకుని జీవిస్తున్నాం. నాకు ముఖ్యమంత్రి జగన్ పింఛన్ ఇస్తున్నాడు. ఇద్దరికి వచ్చే పింఛన్లతో బతుకుతున్నాం. కొడుకులు లేని లోటు తీరింది. ప్రతి నెలా ఠంఛన్‌గా ఒకటో తేదీ ఇంటికి తెచ్చి పింఛన్ ఇస్తున్నారు. మేము ఉన్నంత వరకు మాకు లోటు లేకుండా చూసిన ముఖ్యమంత్రి జగన్ మేలు మరువలేం. ఇలాంటి వారిని ఆ దేవుడు చల్లంగ చూస్తాడు. ఆయన మేలు మేము జన్మలో మరువలేం. ఆయన పండుటాకుల దేవుడు.

పండుటాకుల దేవుడు జగన్

కురిచేడు:

ఎందరు ఉన్నా అవసాన దశలో ఆదరించే వారు లేక ఎందరో వృద్ధాశ్రమాలను ఆశ్రయిస్తున్నారు. కన్న వారిని సాకేందుకు కష్టమైన పరిస్థితుల్లో రాష్ట్రమంతా నా కుటుంబమే.. ప్రతి అవ్వ, తాత నా తల్లిదండ్రులే.. వారిని నేను అవసాన దశలో ఆదరించాలి.. పసుపు కుంకుమ పోగొట్టుకున్న తోబుట్టువుల్లాంటి అక్క చెల్లెమ్మలకు అండగా నిలవాలని.. అంగవైకల్యం కలిగిన వారికి మనోధైర్యం నింపాలని కంకణం కట్టుకుని దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలిచిన ఏకైక ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. తండ్రికి తగ్గ తనయుడిగా తండ్రికన్నా మిన్నగా ప్రజలను



వృద్ధ మహిళలు నివసిస్తున్న ఇల్లు

ఆదరిస్తూ ప్రజల హృదయాల్లో తనకు స్థానం సంపాదించుకున్న ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆదరాభిమానాలు చూరగొంటున్నారు. కురిచేడు మండలంలో మొత్తం 4, 641 మందికి పింఛన్లు ఇస్తున్నారు. వారిలో ఓఏపీ 2,584, అభయహస్తం 36, వికలాంగులు 565, విడో పింఛన్లు 1214, ఫిషర్‌మెన్ 22, సింగిల్ ఉమెన్ 132, ట్రెడిషనల్ కొబ్బలెర్స్ 37, డప్పు కళాకారులు 68, వృద్ధ కళాకారులు ఇద్దరికి పింఛన్లు ప్రతినెలా ఇస్తున్నారు.

సంక్షిప్తంగా

అంగన్‌వాడీలు.. ఆనంద నిలయాలు

కొనకనమిట్ల: అంగన్‌వాడీ కేంద్రాలను ఆనంద నిలయాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, ఆ మేరకు అంగన్‌వాడీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పని చేయాలని సీడీపీఓ సుధామారుతి పేర్కొన్నారు. శుక్రవారం కొనకనమిట్లలో జన భాగస్వామ్యం కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ.. అంగన్‌వాడీల్లో నమోదైన గర్భిణులు, బాలింతలకు జూలై 1 నుంచి ఇంటి వద్దకే పౌష్టికాహారం అందించనున్నట్లు తెలిపారు. కార్యకర్తలకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మీప్రసన్న, మహిళా పోలీస్ ఆశాజ్యోతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తపాలెంలో రోడ్డు మార్జిన్‌కు సర్వే

తాళ్లూరు: పంచాయతీ పరిధిలోని కొత్తపాలెంలో శుక్రవారం ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్జిన్ గుర్తింపునకు సర్వే చేశారు. సర్వేయర్ బాబూరావు ఆధ్వర్యంలో సిబ్బంది సర్వే నిర్వహించారు. సర్వే పూర్తి అయిన వెంటనే నాబార్డు ద్వారా విడుదలైన నిధులతో సైడు కాలువ నిర్మించనున్నారు. గ్రామ కార్యదర్శి లక్ష్మీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి

మార్కాపురం టౌన్: వాహనాలు నడిపేటపుడు జాగ్రత్తలు పాటించాలని మార్కాపురం మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ మాధవరావు సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఎంవీఐ కార్యాలయం వద్ద ఆటో, జీపు, కారు డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంవీఐ మాట్లాడుతూ.. మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నడపవద్దన్నారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతే ఆ కుటుంబ సభ్యుల బాధ్యను ఎవరూ తీర్చలేరన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే ప్రమాదాలకు ఆస్కారం అత్యంత తక్కువగా ఉంటుందని చెప్పారు. పాఠశాలలు, వైద్యశాలలు, దేవాలయాలు, చర్చిలు, మసీదుల వద్ద హారన్ మోగించకుండా నెమ్మదిగా వెళ్లాలని కోరారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని స్పష్టం చేశారు. ఆర్‌సీ, పొల్యూషన్ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్ కచ్చితంగా దగ్గరుంచుకోవాలని సూచించారు.

జగనన్న ప్రభుత్వంలో విద్యాభివృద్ధికి పెద్దపీట

పొదిలి రూరల్: జగనన్న ప్రభుత్వంలో విద్యాభివృద్ధికి పెద్దపీట వేశారని కంభాలపాడు మాజీ సర్పంచ్ పులిగొర్ల శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం కంభాలపాడు పంచాయతీలోని పోతవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ మైలా మల్లేశ్వరి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధి

ముండ్లమూరు: గ్రామాభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేయాలని డీపీఓ నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని ఉమామహేశ్వరపురం సచివాలయంలో శుక్రవారం గ్రామస్తులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామహేశ్వరపురం గ్రామాన్ని కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేసేందుకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఆ నిధులతో గ్రామానికి మౌలిక వసతులు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. సర్పంచ్ వేముల పద్మావతి శ్రీనివాసరావు, ఎంపీడీఓ కె.కుసుమకుమారి, హౌసింగ్ ఏఈ హనుమంతరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మధుబాబు, పంచాయతీ కార్యదర్శి రమేష్‌బాబు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

అర్ధవీడు (కంభం): అగ్ని ప్రమాదంలో గుడిసెలు కాలిపోయి నిరాశ్రయులుగా మిగిలిన అర్ధవీడు చెంచుకాలనీ వాసులకు శుక్రవారం స్పందించే హృదయాలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వంట సామగ్రి, గృహోపకరణాలు అందజేశారు. మిత్రుల ఆర్థిక సహకారంతో బాధితులకు బిందెలు, బకెట్లు, నీటి డ్రమ్ములు, వంట సరుకులు, ఇతర సరుకులు అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ పులి శ్రీనివాస ప్రసాద్, చిన్నోజిరావు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ ప్రథమ వార్షికోత్సవం

పుల్లలచెరువు: మండలంలోని ఉమ్మడివరంలో ఆంజనేయస్వామి, సాయిబాబ, శ్రీబ్రహ్మం గారి ఆలయాల ప్రథమ వార్సికోత్సవాన్ని శుక్రవారం పురోహితుల వేదమంత్రాల మధ్య ఎంతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. ఆదే గ్రామానికి చెందిన చిల్లంచర్ల బ్రదర్స్ రూ.3 లక్షలతో ఆంజనేయస్వామి ఆలయంలో ఇత్తడి తొడుగు చేయించారు. అనంతరం గ్రామస్తుల సహకారంతో రెండు వేల మందికి అన్నదానం చేశారు. గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

పొదిలి: నగర పంచాయతీ పరిధిలోని కొత్తపాలెం జగనన్న లేఔట్‌లో నివేశన స్థలాలు పొందిన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి సూచించారు. శుక్రవారం లేఔట్‌ను పరిశీలించిన ఆయన లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. అనంతరం తహసీల్దార్‌ను వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కల్లం వెంకట సుబ్బారెడ్డి, మాజీ మండల కన్వీనర్ జి.శ్రీనివాసులు పాల్గొన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి జి.చెన్నారెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్‌ను సత్కరించారు. మండల కన్వీనర్ దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, ముల్లా జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

కంభం: పంట పొలాల్లో పేకాట ఆడుతున్న ఇద్దరిని శుక్రవారం సాయంత్రం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ నాగమల్లేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. కంభం చెరువుకట్టకు వెళ్లే మార్గంలోని పంట పొలాల్లో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడులు చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.9700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆత్మహత్య కేసులో నిందితులను అరెస్టు చేయాలి

కొనకనమిట్ల: మండలంలోని చినారికట్ల గ్రామానికి చెందిన రమ్య మృతికి కారకులను అరెస్ట్ చేయాలని దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆమె బంధువులు శుక్రవారం కొనకనమిట్ల బస్టాండ్ సెంటర్లో ధర్నా నిర్వహించారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న మార్కాపురం సబ్‌కలెక్టర్ సేథుమాధవన్ ధర్నాకు గల కారాణాలు అడిగి తెలుసుకున్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై దీపిక రమ్య బంధువులతో మాట్లాడారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. అనంతరం తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. బీఎస్పీ ఇన్‌చార్జి సంద్రపాటి కాలేబుమాదిగ, జనమాల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలుగు బాప్టిస్ట్ ఫీల్డ్ కార్యాలయం ప్రారంభం

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని శ్రీశైలం రోడ్డులో తెలుగు బాప్టిస్ట్ ఫీల్డ్ కార్యాలయాన్ని తెలుగు బాప్టిస్ట్ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రముఖ డైరెక్టర్ జీనుకూటి జాన్‌బాబు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో తాగటానికి నీరు లేని చోట బోర్లను వేయించామన్నారు. కొన్ని గ్రామాల్లో మహిళలకు కుట్టు మిషన్లపై శిక్షణ ఇప్పించి వారికి అవసరమైన మిషన్లను సైతం ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలో మంత్రి ఆదిమూలపు సురేష్ తోడ్పాటుతో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. స్టేట్ ట్రైబల్ కో ఆర్డినేటర్ సింగా నాగరాజుతో పాటు పాస్టర్స్ అసోసియేషన్ కో ఆర్డినేటర్స్ పాల్గొన్నారు.

పొలంలో పనిచేస్తూ యువకుడి మృతి

కంభం: పొలంలో పని చేస్తుండగా సొమ్మసిల్లి పడిపోయిన వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం జరిగింది. వివరాలు.. స్థానిక కోనేటి వీధిలో నివాసం ఉంటున్న కనక సుబ్బారావు (33) అనే యువకుడు ఉదయం పొలంలో కూలి పనికి వెళ్లాడు. పని చేస్తున్న సమయంలో ఒక్కసారిగా సొమ్మసిల్లి పడిపోయాడు. వెంటనే అతడిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

సజ్జలకు మంత్రి సురేష్ జన్మదిన శుభాకాంక్షలు

యర్రగొండపాలెం: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో సజ్జలను కలిసి బొకే అందజేసి మంత్రి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



సజ్జలకు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి సురేష్

ఉద్యోగాలు కల్పించాలన్నదే సీఎం లక్ష్యం



విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్

- ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్

దర్శి: నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో జరిగిన స్కిల్‌హబ్ శిక్షణ కార్యక్రమంలో విద్యార్థులకు సర్టిఫికెట్‌లు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మద్దిశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ స్కిల్‌హబ్ ద్వారా నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించడం శుభపరిణామమన్నారు. ఉద్యోగాలు పొందిన వారు క్రమశిక్షణ, ఆత్మస్థైర్యంతో మెళకువలతో ఉద్యోగాల్లో రాణించాలని కోరారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి భరద్వాజ మాట్లాడుతూ రెండో విడతలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ధ్రువపత్రాలు తీసుకున్న వారికి అభినందనలు తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్.లోక్‌నాథం మాట్లాడుతూ ఉద్యోగ వివరాలు, జీతభత్యాల గురించి వివరించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సావిత్రి, ఎ.నగేష్, మర్తనాలి, ఆర్‌డబ్ల్యూఎస్ కె.సుబ్బారావు, సురేష్, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

ఎంపీ నిధులతో వాటర్ ట్యాంక్ ప్రారంభం

దర్శి: ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి నిధులతో ఏర్పాటు చేసిన స్టీల్ ట్రాక్టర్ ట్యాంకర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ ప్రారంభించారు. ఐదు లక్షల రూపాయల నిధులతో ఏర్పాటు చేసిన ట్యాంక్‌ను కౌన్సిలర్ వీసీ రెడ్డి కోరిక మేరకు నగర పంచాయతీకి అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ట్యాంకర్ ద్వారా నగర పంచాయతీలో ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తారని చెప్పారు.



వాటర్ ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ ఎన్నిక

మార్కాపురం టౌన్: మార్కాపురం సబ్ కలెక్టర్ సేథు మాధవన్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ, సఫాయి, చర్మకార కమిటీ ఎన్నిక శుక్రవారం నిర్వహించారు. నూతన కమిటీ సభ్యులుగా ఆదిమూలపు అనిల్‌రాజ్ లూకా, బూదాల గురవయ్య, రోజ్‌లిడియా, దొడ్డా భాగ్యలక్ష్మిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ అంకితా సురానా, డీఎస్పీ వీరరాఘవరెడ్డి, ఏఎస్‌డబ్ల్యూఓ అరుణ తదితరులు పాల్గొన్నారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి, బాధితులకు న్యాయం చేయాలని సూచించారు.



కమిటీ సభ్యులతో సబ్ కలెక్టర్ సేథు మాధవన్

నేడు అంకాలమ్మ తల్లి జాతర

కొనకనమిట్ల: మండల కేంద్రమైన కొనకనమిట్లలో శనివారం అంకాలమ్మతల్లి జాతర వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 20 ఏళ్ల క్రితం గ్రామంలో వైభవంగా జాతర నిర్వహించారు. అప్పటి నుంచి ఏటా జూన్ నెలలో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లిస్తున్నారు. కానీ ఈ ఏడాది ఘనంగా జాతర నిర్వహించడానికి కొనకనమిట్లతోపాటు పంచాయతీ పరిధిలోని పుట్లూరివారిపల్లి, ఎర్రగడ్డ గ్రామాల ప్రజలు నిర్ణయించారు. శనివారం రాత్రి వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రెండు విద్యుత్ ప్రభలు, టీడీపీ తరపున ఒకటి, మరో మొక్కుబడి ప్రభ ఏర్పాటు చేస్తున్నారు. శుక్రవారం అమ్మవారి ఆలయాన్ని అలంకరించి అంకాలమ్మతల్లికి ప్రారంభ పూజలు నిర్వహించారు.



అంకాలమ్మ తల్లి

ప్రముఖులకు ఆహ్వానం

అంకాలమ్మ తల్లి జాతరలో పాల్గొనాలని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డిని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పునుగోటి కొండారెడ్డి, యక్కంటి తిరుపతిరెడ్డి, సూరవరపు పెదవెంకటరెడ్డి, కల్లం దిబ్బారెడ్డి, శిగినం కొండయ్య ఆహ్వానించారు.

రేపు మర్రిపూడిలో వైద్య శిబిరం

పొదిలి: స్థానిక ఉడుముల హాస్పిటల్లో వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నట్లు డైరెక్టర్లు మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, ఎస్పీ గీతికారెడ్డి పేర్కొన్నారు. వైద్యశాలలో విజయవంతంగా సేవలందిస్తున్న డాక్టర్లు, సిబ్బందిని శుక్రవారం ప్రత్యేకంగా అభినందించి కేక్ కట్ చేశారు. మాజీ ఎమ్మెల్యే ఉడుముల మాట్లాడుతూ.. జనరల్ మెడిసన్ విభాగంలో సుదీర్ఘ అనుభవం కలిగిన డాక్టర్ జీవన్‌రెడ్డి సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చాయన్నారు. మర్రిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 18వ తేదీన ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని, సమీప గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఉపాధి హామీ పనుల్లో పారదర్శకత ఉండాలి



పర్సనల్ హియరింగ్ సమావేశంలో మాట్లాడుతున్న ఝాన్సీరాణి, పక్కన దాసరి సురేష్

- డ్వామా విజిలెన్స్ అధికారి ఝాన్సీరాణి

పొదిలి రూరల్: జాతీయ ఉపాధి హామీ పథకానికి ప్రభుత్వం కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగిస్తూ పనుల్లో నాణ్యత, పారదర్శకత పాటించాలని డ్వామా విజిలెన్స్ అధికారి పి.ఝాన్సీరాణి పేర్కొన్నారు. పొదిలి, మర్రిపూడి, దర్శి మండలాలకు సంబంధించి సోషల్ ఆడిట్ 13, 14 రౌండ్ల పర్సనల్ హియరింగ్‌ను శుక్రవారం పొదిలి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనులను సిబ్బంది క్షేత్ర స్థాయిలో పరిశీలించి అవకతవకలు లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. గత సామాజిక తనిఖీల్లో గుర్తించిన అవకతవకలకు సంబంధించి నిధులను ప్రభుత్వానికి తిరిగి చెల్లించాలని స్పష్టం చేశారు. అనంతరం సిబ్బంది తమ అభ్యర్థనలను సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.శ్రీకృష్ణ, సోషల్ ఆడిట్ మేనేజర్ దాసరి సురేష్, పొదిలి, మర్రిపూడి, దర్శి, కొనకనమిట్ల ఏపీఓలు టి.వెంకటరావు, రాంబాబు, కళ్యాణి, బుల్లెన్నరావు, ఈసీలు, టీఏలు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని వైద్యులు

కంభం: పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కోట్లాది రుపాయలు వెచ్చిస్తుంటే కొందరు వైద్యుల నిర్లక్ష్యంతో పేద ప్రజలు సరైన వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారు. కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట మండలాల ప్రజల కోసం కంభంలో 30 పడకల ప్రభుత్వ వైద్యశాల ఉంది. ప్రస్తుతం వైద్యశాల 50 పడకల వైద్యశాలగా అప్‌గ్రేడై రూ.2.48 కోట్ల నాబార్డు నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. వైద్యశాలలో ఏడుగురు వైద్యులు పనిచేస్తున్నారు. వీరిలో కొందరు సమయపాలన పాటించడం లేదు. ఒక్కోసారి 11 గంటలకు కూడా వైద్యులు వారి సీట్లలో కూర్చోక పోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు అవస్థలు పడుతున్నారు. రోడ్డు ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో వచ్చిన క్షతగాత్రులకు వైద్యశాలలో సరైన వైద్యం అందడం లేదని, వచ్చిన రోగులను పరీక్షించకుండానే వెంటనే రిఫర్ చేస్తున్నారన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. రాత్రి పూట ప్రమాదాలు జరిగితే డ్యూటీ డాక్టర్లు సక్రంగా అందుబాటులో ఉండక పోవడంతో పేషెంట్లను తీసుకొని మరోచోటుకు పరుగులు తీయాల్సి పరిస్థితి ఏర్పడుతోంది.



ఓపీ కోసం వచ్చిన రోగులు